క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి..



సీసీ కెమెరాలను పోలీసులకు చూపిస్తున్న వ్యాపారస్తుడు

వీరఘట్టం: దొంగతనాలను అరికట్టడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు వీరఘట్టం మేజరు పంచాయతీలోని ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపారులంతా తమ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై జి. కళాధర్ సూచించారు. దీంతో పలువురు వ్యాపారులు మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. బిగించిన సీసీ కెమెరాలను మంగళవారం పోలీసులకు చూపించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న ఎంఆర్‌టీ బృంద సభ్యులు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చురుగ్గా మరమ్మతులు చేపడుతున్నారు. 'వేసవిని తలపిస్తున్న విద్యుత్ కోతలు' శీర్షికన గత నెల 28న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పార్వతీపురం నుంచి ఎంఆర్‌టీ బృందం వచ్చి పరిస్థితి సమీక్షించి మరమ్మతులు చేపడుతున్నారు. త్వరలోనే సరఫరాను పునరుద్ధరిస్తామని ఇన్‌చార్జ్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.

శ్రమదానం..



తుప్పలు, డొంకలు తొలగిస్తున్న గిరిజనులు

సీతంపేట: మండల పరిధి చిన్నబగ్గ కాలనీకి చెందిన గిరిజనులు సోమవారం శ్రమదానం చేపట్టి రోడ్డుకిరువైపులా ఉన్న తుప్పలు, మొక్కలను తొలగించారు. పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో గిరిజనులు శ్రమదానంతో కీసరజోడు నుంచి మర్రిపాడు వరకు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు.

రహదారికి మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లే సీసీ రహదారి పలుచోట్ల గోతులమయం కావడంతో ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు చొరవచూపి రహదారికి మరమ్మతులను నిర్వహించారు. గోతుల మయం అయిన రహదారిపై ద్విచక్ర వాహనాలు, స్థానికులు రాకపోకలు చేసేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్న కారణంగా రహదారికి మరమ్మతులను నిర్వహించడంతో స్థానికులు ఎస్‌ఐ రమేష్‌నాయుడును అభినందించారు.

ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

జియ్యమ్మవలస: పీఎంఏవై 2.0లో కొత్తగా ఇళ్లు కావాలనుకునే వారు అర్హులైన దరఖాస్తు చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్. ఉమామహేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆధార్, బ్యాంకు అకౌంట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్ అందజేసి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల బిల్లులు సకాలంలో అందుతున్నాయని అన్నారు.

వైద్య సేవలు అధ్వానం..

• వీరఘట్టం పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై విమర్శలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పట్టణ ప్రజలు పలువురు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్దకు చేరుకుని సిబ్బంది తీరుపై అడిషనల్ డీఎంహెచ్‌ఓ వినోద్‌కు వివరించారు. రాత్రిపూట అత్యవసర సేవలకు వస్తే కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా పాలకొండ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని తెలిపారు. ఇద్దరు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నా నాణ్యమైన సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓను కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ, పీహెచ్‌సీకి ఓపీ ఎక్కువగా ఉందని..ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఆయనతో పాటు డాక్టర్ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

• పాముల కాలం..

రైతన్నా జర భద్రం



పాలకొండ రూరల్:

• పొలాల్లో పాము కాటుకు గురవుతున్న రైతులు
• జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

ప్రస్తుత సీజన్‌లో విష పురుగులు, పాములు అధికంగా సంచరిస్తుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. రబీ సీజన్ ప్రారంభం కావడంతో పాటు తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో రైతులు పాముకాటుకు గురయ్యే అవకావం ఉంది. పైగా పాములు కూడా గుడ్లను పొదిగి పిల్లల చేసే సమయం ఇదే. కాగా వర్షాల కారణంగా పొలాల్లో నీరు చేరడంతో కప్పలు, ఎలుకలు కూడా బయటకు వస్తుంటాయి. వాటిని వేటాడేందుకు పాములు పొలాల్లో సంచరిస్తుంటాయి.

పాములు సంచరించే ప్రాంతాలు

కాల్వ గట్లు, గడ్డి పొదలు, గడ్డి కుప్పలు, పొలం గట్లు, పశువుల పాకలు, పాడుబడిన ఇళ్లు, పెంటదిబ్బలు, కూరగాయల పందిళ్లు, నీటి కాలువలను అనుసరిస్తూ పాములు, విష పురుగులు సంచరిస్తుంటాయి. రాత్రి వేళల్లో ఆహారం కోసం బయటకు వచ్చి బల్లెలు, ఎలుకలు, కప్పలు, తొండలను పట్టుకుని ఆరగిస్తాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కువగా ఉన్నచోటకు పాములు వస్తుంటాయి. పంట పొలాల్లో తిరిగే పాములు చాలా ప్రమాదకరమైనవి. పాములకు ప్రాణభయం కలిగినా.. ఎవరైనా తొక్కినా వెంటనే కాటు వేస్తాయి. ఇటీవల పాలకొండ మండలం రుద్రిపేటలో వైకుంటరావు పొలంలో నూర్పిడి పనులు చేపడుతుండగా పాముకాటుకు గురయ్యాడు. అలాగే బాసూరు, బడ్డుమాసింగి ప్రాంతాల్లో పాముకాటు బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఇటీవల పొలంలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వైకుంటరావు

పాముకాటు గుర్తింపు..

పాముకాటు శరీరంపైన పడిందా లేక బట్టల పైన పడిందా అన్న విషయాన్ని ముందుగా బాధితులు పరిశీలించాలి. శరీరం పైన కాటు వేస్తే ఎన్ని గాట్లు పడ్డాయో చూడాలి. త్రాచుపాము, కట్ల పాము, రక్తపింజరి కాటేస్తే రెండు గాట్లు పడతాయి. అంతకంటే ఎక్కువ గాట్లు కనిపిస్తే అది సాధారణ పాముగా గుర్తించవచ్చు. కాటు వేసిన శరీర భాగం నుంచి ఇతర భాగాలకు రక్త ప్రసరణ జరగకుండా పైభాగాన రబ్బరు, తాడు లేదా గుడ్డతో గట్టిగా కట్టాలి. దీనివల్ల విషం త్వరగా గుండెను చేరకుండా నివారించవచ్చు.

ప్రథమ చికిత్స ఇలా...



పాము కాటు వేసిన పైభాగంలో వెంటనే రక్త ప్రసరణ జరగకుండా తాడుతో కట్టాలి. కాటు వేసిన శరీర భాగం వద్ద బ్లేడుతో చిన్న గాయం చేసి వీలైనంతవరకు విషం బయటకు వచ్చేలా ప్రయత్నించాలి. ఇదే సమయంలో గాయం నుంచి అధిక రక్తం బయటకు పోకుండా జాగ్రత్త పడాలి. పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన పడకుండా ధైర్యంగా ఉండాలి. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలి.

జాగ్రత్తలు...

గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తిరిగే వారు.. పొలాలు, కళ్లాల్లో నిద్రించే వారు తమ వెంట టార్చిలైట్ లేదా సెల్‌లైట్‌ను ఉంచుకోవాలి. పాములు కిరోసిన్, పెట్రోల్ వాసన భరించలేవు. పాము ఉందని అనుమానం వస్తే వీటిని ఉపయోగిస్తే మంచిది. రైతులు, కూలీలు పొలాల్లో సంచరించేటప్పుడు మోకాళ్లవరకు ఉండే రబ్బరు బూట్లు వేసుకోవడం మంచిది. గడ్డి పని చేసే వారు చేతికి రబ్బరు తొడుగులు తొడుక్కోవడం మేలు. నివాసాల చుట్టూ ముళ్ల పొదలు లేకుండా చూసుకోవాలి.



దమ్ము పొలంలో సంచరిస్తున్న విషపూరితమైన పాము

నాటు వైద్యం వద్దు..



కట్ల పాము, రక్త పింజరి, నాగుపాము, తేళ్లు, జెర్రెలు కరిచినవెంటనే వైద్యులను సంప్రదించాలి.ఎటువంటి పరిస్థితుల్లోనూ నాటువైద్యం చేయకూడదు. సమయానికి వైద్యం అందకపోతే బాధితులు ప్రాణాలో కోల్పోవచ్చు. త్రాచు పాము, నాగుపాము, కట్లపాము కాటేస్తే విషం నేరుగా నాడీ మండలం, ఊపిరితిత్తులు, శరీరంలోని సున్నితమైన భాగాలపై ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో హృదయ స్పందన ఆగిపోయి అకాల మరణం సంభవించే ప్రమాం ఉంది. రక్తపింజరి విషం ఎక్కువగా రక్త నాళాలపై ప్రభావం చూపుతుంది. దీంతో రక్త నాళాలు చిట్లి నోటి నుంచి రక్తం వస్తుంది. బాధతులకు ధైర్యం చెబుతూ వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం అందించారు. అన్ని పీహెచ్‌సీలలో పాముకాటు ఇంజిక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

– జి.నాగభూషణరావు,
సూపరింటిండెంట్, పాలకొండ ఏరియా ఆస్పత్రి

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి

• పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు



ఎస్‌ఐలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం: సైబర్ క్రైం, స్టేట్‌బ్యాంకు రివార్డ్ యాప్‌ల బారిన పడి నగదును పోగొట్టుకోకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు ఎస్‌ఐలకు సూచించారు. ఈ మేరకు తన పర్యటనలో భాగంగా మంగళవారం ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం ఎస్‌ఐలు బి.శివప్రసాద్, పి.నారాయణరావు, నీలకంఠారావులతో మాట్లాడుతూ సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతా నియమాలపై సంకల్పం పేరుతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడి ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలంటూ తెలియజేయాలన్నారు. ఇటీవల స్టేట్ బ్యాంకు రివార్డ్ యాప్ అంటూ సైబర్ నేరగాళ్లు మరో మోసానికి తెగబడ్డారని, స్టేట్ బ్యాంకుకు ఆ యాప్‌నకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. బ్యాంకు అధికారులు అటువంటి యాప్‌లు ఖాతాదారులకు పంపించరని, ఆ యాప్‌ను ఎవ్వరూ మొబైల్‌లో అనుసంధానం చేసుకోవద్దని, వివరాలు నమోదు చేయొద్దని తెలియపర్చాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం పట్ల ఎటువంటి సమాచారం ఉన్నా తెలియపర్చేందుకు విద్యా సంస్థల్లో నెలకొలిన డ్రాప్ బాక్స్‌ను ప్రతీ రోజూ పరిశీలించాలని అన్నారు. ఫిర్యాదులు ఉంటే ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి తక్షణ చర్యలకు పూనుకోవాలని, డ్రాప్ బాక్స్‌ను సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా ప్రధాన జంక్షన్ల వద్ద కూడా ఏర్పాటు చేయాలని ఎస్‌ఐలకు సూచించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద అక్రమ రవాణాపై నిఘా పెట్టేందుకు నిరంతర పర్యవేక్షణతో సీసీ కెమెరాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట సీఐ బి.హరి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



గుణదలో అపరాల విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయం ఎంతో ప్రయోజనకరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి పి.షన్ముఖరాజు అన్నారు. మండలంలోని మంగళాపురం, గుణద గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువులతో పంటలు పండించడం వల్ల రానురాను భూసారం తగ్గటంతో పాటు దిగుబడి తగ్గి, ఆ ఉత్పత్తులను తిన్న వారి ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. అదే ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించి పంటలు పండించుకోవడం వలన భూసారం పెరుగుతుందని, ఫలితంగా దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని, ఆ ఉత్పత్తులు తిన్నవారి ఆరోగ్యానికి ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. కావున ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరిస్తూ 365 రోజులూ భూమిలో పలు పంటలను సాగు చేస్తూ ఆదాయం పొందాలని సూచించారు. ముఖ్యంగా రబీలో మినుములు, పెసలు, ఉలవలు, నువ్వులు, రాగి, వేరుశనగ వంటివి ప్రధాన పంటలుగా అందులో అంతర పంటలుగా జొన్న, బెండ, గోంగూర, తోటకూర, ఆవాలు, చిక్కుడు, ఆముదం వంటివి సాగు చేసుకుంటే ఉపయోగకరమన్నారు. అపరాల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ ప్రసాద్, ఎంటీఎల్ గణేష్ శరత్ చంద్ర, వీఏఏ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రేమను పంచాలి..



సీతంపేట: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ ఆనందరావు



పాలకొండ రూరల్: ర్యాలీ చేస్తున్న అధికారులు, పిల్లల తల్లితండ్రులు



గుమ్మలక్ష్మీపురం(కురుపాం) : కురుపాం భవిత కేంద్రంలో విజేతలైన దివ్యాంగ పిల్లలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ



వీరఘట్టం: బహుమతులు పొందిన దివ్యాంగ చిన్నారులతో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ ఆనందరావు, తదితరులు



గరుగుబిల్లిలో నిర్వహించిన దివ్యాంగుల ర్యాలీ

దివ్యాంగుల పట్ల వివక్ష కనబరచకుండా.. ప్రతి ఒక్కరికీ ప్రేమను పంచాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్

ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట: హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం సందర్శించారు. మై స్కూల్.. మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పదో తరగతిలో మంచి మార్కులతో పాస్ కావాలని ఆకాంక్షించారు. అనంతరం మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : పీఓ

గరుగుబిల్లి: ఆస్పత్రిలో తనిఖీలు కోసం వచ్చిన రోగులకు సేవలందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవల గూర్చి రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రిలోని పరిసరాలను, పరికరాలను, మందుల నిల్వలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రసవాలు ప్రభుత్వాస్పత్రిలో జరిగేలా చూడాలన్నారు. రక్తహీనత లోపం లేకుండా అవసరమైన పౌష్టికాహారాన్ని, మందులను అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు భరోసా ఇచ్చేలా వైద్యం ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, వైద్యాధికారి కెకె సాగర్ వర్మ, ఎంపీడీఓ జి.పైడితల్లి తదితరులు ఉన్నారు.

ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్లు



ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) రిజిస్ట్రేషన్లను పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయం సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని రకాల షాపుల వద్దకు వెళ్లి (వ్యాపార సముదాయాలు) నిర్వాహకులచే ఎంఎస్‌ఎంఈలో రిజిస్ట్రేషన్ చేయించారు. చిన్న చిన్న పరిశ్రమలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ప్రోత్సాహం (ఆర్థిక సహాయం) చేయడానికి భారత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈని ఏర్పాటు చేసిందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి సరసమైన వడ్డీ రేట్లకు బ్యాంకుల నుంచి రుణాలు, ఆదాయపు పన్ను మినహాయింపులు, పరిశ్రమల ఏర్పాటు కోసం వెంటనే లైసెన్స్‌లు మంజూరు, విద్యుత్ బిల్లులపై రాయితీలు వంటి సదుపాయాలను కల్పించేందుకు ఆవకాశం ఉందని వ్యాపారులకు తెలియజేశారు.

కూటమి ప్రభుత్వం తీరుతో అన్యాయం..

• ఎంటీఎస్ ఉపాధ్యాయులు



ఎమ్మెల్యే జయకృష్ణకు తమ సమస్యలు చెబుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం నిర్వాకంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిలో పనిచేస్తున్న 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు ఆరోపించారు. ఈ మేరకు మండలంలోని ఎం. రాజపురంలో ఎమ్మెల్యే జయకృష్ణను ఆయన స్వగృహంలో మంగళవారం కలసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గత ప్రభుత్వం స్థానికంగానే మాకు పోస్టింగ్‌లు ఇచ్చిందని.. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట దూరప్రాంతాలకు బదిలీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో నాలుగైదు సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ చేయనున్న తమకు దూరప్రాంతాలకు బదిలీ చేయడం తగదన్నారు. వెంటనే ఎమ్మెల్యే జయకృష్ణ డీఈఓకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. అయినప్పటికీ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న డీఐఓ ఎం.నారాయణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గర్భిణుల ఆరోగ్యంపై ఆశా కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ అన్నారు. కురుపాం మండలం మొండెంఖల్లు, నీలకంఠాపురం పీహెచ్‌సీలలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రతీ ఆశా కార్యకర్త క్షేత్ర సందర్శనలో కనీసం ఐదుగురు గర్భిణుల వద్దకు వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలన్నారు. వైద్యాధికారులు ప్రదీప్, సమర సింహారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జయగౌడ్, నాగేశ్వర రావు, శ్రీహరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసే వారిపై చర్యలు

గుమ్మలక్ష్మీపురం: ఉద్యోగాల పేరుతో గిరిజనులను నమ్మించి, డబ్బు కాజేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజనాభ్యుదయం సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మన్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఇరువురు వ్యక్తులు సుమారు 20 మంది గిరిజనుల నుంచి డబ్బులు కాజేశారని పేర్కొన్నారు. ఇటువంటి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై క్రిమినల్ చర్యలతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసేందుకు ఐటీడీఏ, పోలీస్ అధికారులు చొరవ చూపాలని కోరారు.

• ప్రత్యేక పూజలు..



పాలకొండ డివిజన్ కేంద్రంలోని భీమలింగేశ్వర ఆలయంలో స్వామివారికి కార్తీక మాసం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామివారిని అలంకరించారు. అలాగే సదాశివ ఆలయంలో దామోదరునికి కూడా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రసాదం స్వీకరించారు.

– పాలకొండ రూరల్

• వినతి..



పాలకొండ పట్టణంలో వేద పాఠశాల ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని బ్రాహ్మణ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణ మాజీ చైర్మన్ పల్లా కొండలరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వేద పాఠశాల ఏర్పాటు చేస్తే చాలామంది వేదం నేర్చుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పాఠశాల నిర్మాణానికి సహకారం అందిస్తానని కొండలరావు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కోట దుర్గమ్మ ఆలయ ప్రధానార్చకుడు లక్ష్మీప్రసాద్ శర్మ, బంకుపల్లి చిట్టిబాబు శర్మ, జొన్నగడ్డల కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ